క్లుప్తంగా

సుంకేసులకు పెరిగిన వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి వరద నీటి ప్రవాహం పెరిగింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో బ్యారేజీకి శనివారం వరద నీటి ప్రవాహం కొంత పెరిగింది. దీంతో పాటు టీబీ డ్యాంకు సైతం స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యా నుంచి నీటి విడుదలను పెంచగా, ఆ నీటితో పాటు వేదావతి నది వరద నీటితో కలిసి మంత్రాలయం దగ్గర 53,500 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రస్తుతం బ్యారేజీకి 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఇందులో 12 క్రస్టు గేట్లు మీటర్ పైకెత్తి 49,632 కూసెక్కులు దిగువకు, కేసీ కాలువకు 2012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

క్విట్ ఇండియా నినాదంతోనే స్వాతంత్య్రం

కర్నూలు(సెంట్రల్): భారతదేశానికి క్విట్ ఇండియా నినాదంతోనే స్వాతంత్రం వచ్చిందని కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 84వ క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1942 ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమానికి గాంధీజీ పిలుపునిచ్చారు. ముంబైలోని వార్ధా ప్రాంతంలో చేపట్టిన ఉద్యమాన్ని దేశమంతటా విస్తరించడంతో బ్రిటీషు పాలకులు దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి దాదాపుగా అంగీకరించారని, అందువల్ల క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దామోదరం రాధాకృష్ణ, సయ్యద్‌ఖాదిపాషా, మహేంద్రనాయుడు, బజారన్న, బతుకున్న, డీపీ సాంబశివుడు, ఎజాస్ అహ్మద్, రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, లాజరస్ పాల్గొన్నారు.

'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: రాజ్యం కుట్రపూరితంగా వ్యవహరించి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడం దుర్మార్గమని ప్రముఖ న్యాయవాది జయరాజు అన్నారు. శనివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో విరసం ఆధ్వర్యంలో ఆదివాసీ హక్కుల నేత స్టాన్‌స్వామి రచించిన జైలు డైరీ 'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో పౌరులకు న్యాయం అందడం లేదని స్టాన్ స్వామి ఉదంతమే ఉదాహరణ అన్నారు. నేరస్తులు తప్పించుకుని తిరుగుతున్నారని, నేరం చేయనివారు బందీలవుతున్నారన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈ పుస్తకం నివాళి కాదని, ఇది ప్రగతిశీల వాదులకు కార్యాచరణగా భావించాలన్నారు. సభలో విరసం నాయకులు పాణి, అరుణ్ తదితరులు ప్రసంగించారు.

ఇస్కాన్‌లో బలరామ పూర్ణిమ వేడుకలు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శనివారం బలరామ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. తులసి హారతి, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 56 రకాల ఆహార పదార్థాలతో రాజభోగ నివేదన, మహా హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఝులన్ యాత్ర ఉత్సవాలు ప్రారంభం

భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీ రాధా గోవింద ఝులన్ యాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వైభవంగా ఉయ్యాల సేవ నిర్వహించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు.

భక్తి శ్రద్ధలతో హయగ్రీవ జయంతి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం హయగ్రీవ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. హయగ్రీవ మూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ హయగ్రీవ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువత పోరాడాలి

కర్నూలు(సెంట్రల్): దేశ భవిష్యత్ కోసం యువత పోరాడాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు పిలుపునిచ్చారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యానవనం.. అధ్వానం

- పిచ్చి మొక్కలతో నిండిన పార్కులు
- నగర వాసులకు దూరమవుతున్న ఆహ్లాదం
- పార్కులు ఉన్నా వసతులు శూన్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కల్లూరు: కర్నూలు నగరంలో మొత్తం 52 వార్డులు ఉండగా అందులో 16 వార్డులు పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. అర్బన్ వార్డుల్లో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తుంది. అయితే అందుకు తగిన మౌలిక వసతులను మున్సిపల్ అధికారులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఉద్యానవనాల్లో పిచ్చి మొక్కలు

కల్లూరు అర్బన్ పరిధిలోని పలు ఉద్యానవనాలు పిచ్చి మొక్కల మయంగా మారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారిన జీవనశైలిలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. కొంత సేపైనా కాలుష్యం లేని ప్రాంతంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ ఆహ్లాదంగా గడపాలని అనుకుంటున్నారు. ఆయా కాలనీల్లో మున్సిపల్ పార్కులు ఏర్పాటు చేశారు గానీ ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో వృథాగా ఉన్నాయి. కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు, కంప చెట్లు పెరిగాయి. మరికొన్ని పార్కుల్లో మద్యం సీసాలు, చెత్త చెదారంతో నిండి ఉన్నాయి. పార్కులు వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధనలక్ష్మి నగర్‌లోని పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న పార్కు ధనలక్ష్మి నగర్‌లోనిది. పార్కులోకి ధనలక్ష్మినగర్, నంద్యాల, నందికొట్కూరు రోడ్లకు సమీపంలో ఉండడంతో చాలా కాలనీలకు చెందిన ప్రజలు వాకింగ్ చేయడానికి వస్తారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనంతో నింపాలి. చిన్న పిల్లలకు ఆడుకునే పరికరాలు, యువకులు, పెద్దలు వ్యాయామం చేయడానికి పరికరాలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేలా ట్రాక్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



సంక్షేమ భవన్ వెనక ఉన్న పార్కులో తిరుగుతున్న పందులు

☛ ఈ చిత్రంలో కనిస్తున్న పార్కు సంక్షేమ భవన్ వెనకాల ఉంది. గేట్లు సరిగా లేకపోవడంతో ని త్యం పందులు, కుక్కలు తిరుగుతుంటాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ పార్కు పందు ల కు, కుక్కలకు ఆవాసంగా మారింది. అసాంఘిక కా ర్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కుల లోపల మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. పార్కు వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





ట్రైబల్ వెల్ఫేర్ కాలనీలోని పార్కు దుస్థితి

☛ ఈ చిత్రంలో కనిస్తున్న పార్కు చుట్టూ ట్రైబల్ వెల్ఫేర్ నగర్, సిండికేట్ బ్యాంకు కాలనీ, కమలా నగర్, శాంతనగర్‌తో పాటు వివిధ కాలనీలు ఉన్నాయి. వారందరి కోసం మున్సిపల్ అధికారులు పార్కును ఏర్పాటు చేసి అందులో వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట పరికరాలు, జిమ్ పరికరాలు మొదలగునవి ఏర్పాటు చేశారు. పార్కులో ఏర్పాటు చేసి న పరికరాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. అక్కడక్కడ ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులను వినియోగంలోకి తీసుకురావాల ని చుట్టు పక్కల కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కూటమి నేతలూ.. ఈ గుంతలు చూడండి



పాత ఈద్గా దగ్గర దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న డీవైఎఫ్‌ఐ బృందం

కర్నూలు(సెంట్రల్): గుంతలు లేని రహదారులే కూటమి ప్రభుత్వం లక్ష్యమంటూ గొప్పలు చెప్పిన ఆ పార్టీ నేతలకు నగరంలో రహదారులపై గుంతలు కనిపించడం లేదా అని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా విమర్శించారు. శనివారం డీవైఎఫ్‌ఐ బృందం కర్నూలు నగరంలో దెబ్బతిన్న పలు రోడ్లను పరిశీలించింది. పాత ఈద్గా, గాయత్రీ హాస్పిటల్, బళ్లారి చౌరస్తా సమీపంలోని ప్రధాన రహదారి, హెచ్‌పీ పెట్రోల్ బంక్, వికర్ సెక్షన్ కాలనీల్లో దెబ్బతిన్న పలు రహదారలను పరిశీలించారు. అయితే ఎక్కడ చూసినా గుంతలు పడిన రహదారులే దర్శనం ఇవ్వడంతో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రహదారుల మరమ్మతుల కోసం విడుదల చేసిన నిధులు ఏమయ్యాని ప్రశ్నించారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

కర్నూలు సిటీ: పీఎంశ్రీ కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీమ్యాట్ డైరెక్టర్ వి.మస్తానయ్య సూచించారు. శనివారం సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ కార్యాలయంలో పీఎంశ్రీ కింద ప్రభుత్వ స్కూళ్లలో చేపట్టిన పనుల పురోగతిపై డీఈఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ ఎస్.శ్యామూల్ పాల్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీమ్యాట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లకు మంజూరైన నిధులను వినియోగించిన వాటికి బిల్లులు సత్వరమే అప్లోడ్ చేసేలా ఆయా స్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులకు, మండల అధికారులతో సమావేశాలు నిర్వహించి తెలియజేయాలన్నారు. పనుల పురోగతిపై రెగ్యులర్‌గా సమీక్షించాలన్నారు. స్కూళ్లలో విద్యార్థుల సామర్థ్యాలను పర్యవేక్షణకు వెళ్లిన సమయంలో పరీక్షించాలన్నారు. విద్యాశాఖ నిర్మిస్తున్న స్కూల్ భవనాలను భావితరాలకు బంగారు బాట వేసేలా పనులు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాసులు, సెక్టోరియల్ ఆఫీసర్లు డాక్టర్లు వై ధన్‌రాజు, సురేంద్ర బాపూజీ, స్నేహలత, ఏఎస్‌ఓ మల్లయ్య, అసిస్టెంట్ ఏఎంఓ షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు విద్యాశాఖాధికారి శ్యామూల్ పాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వామపక్ష పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఇటీవల డీఈఓ శిక్షణకు వచ్చిన పీజీటీ టీచర్లతో (మహిళలు) నృత్యాలు చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏ, యూఎఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌ఓ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాజు, బి.మహేంద్రబాబు, ఉదయ్‌కుమార్, శేఖర్‌నాయుడు, సురేంద్రబాబు, నాగార్జున మాట్లాడుతూ..శిక్షణ కోసం వచ్చిన ఉపాధ్యాయులతో డీఈఓ నృత్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యాశాఖలోని సమస్యలను పరిష్కరించమంటే మహిళా ఉపాధ్యాయులతో నృత్యాలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కస్తూర్బా సీట్లను అమ్ముకున్న డీఈఓపై విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. తక్షణమే సమగ్ర శిక్ష ఏపీసీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి డీఈఓను తప్పించి కొత్త వారిని నియమించాలని కోరుతూ కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దయ్య, జనార్దన్, ఆర్యన్, రాజు, వీరేష్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

డీఈఓపై ఆరోపణలు సిగ్గుచేటు

కర్నూలు (టౌన్): జిల్లా విద్యా శాఖాధి శ్యామూల్ పాల్‌పై కొందరు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఏపీ పీఈటీ ఎస్‌ఏ, పీఈల అసోసియేషన్ అధ్యక్షులు జోసఫ్ లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో అన్నారు. డీఈఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులు, అలాగే ఇటీవల సస్పెండ్ అయినా ఉద్యోగులే డీఈవోపై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేజీబీవీ పాఠశాల టీచర్, శిక్షణ సిబ్బందిని ప్రోత్సహిస్తు వారితో సంప్రదాయంగా నృత్యం చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. ఇదే అదనుగా సమస్యలే లేవన్నట్లు కొన్ని సంఘాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు.

బంగారు గొలుసు చోరీ

బేతంచెర్ల: వివాహ వేడుకకు హాజరైన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం చోటు చేసుకుంది. పగిడాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వసంత జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరై అక్కడే పెళ్లి వారితో కలిసి నిద్రించారు. శనివారం తెల్లవారు జామున తన మెడలోని మూడు తులాల బంగారు చైనును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీనిపై బాధిత మహిళ బేతంచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుకున్న 1993–1999 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, గురుకుల విద్యాలయాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుత నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, గతంలో పని చేసిన ఉపాధ్యాయులు, ప్రస్తుత ఉపాధ్యాయులు తప్పకుండా హాజరై, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉరుకుందలో భక్తజన సందడి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణ శుక్రవారంతో పాటు రెండవ శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు సెలవు రోజులు కలిసి రావడంతో శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగింది. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

కూటమి పాలనలో మహిళలకు మోసం

- వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి



కల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు మోసపోతున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ విభాగం అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి విమర్శించారు. కర్నూలులోని కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేతారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి నేతలు దాటవేయడం తగదన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 1500 ఇస్తామని చెప్పి దత్తత పేరుతో మోసం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉచిత బస్సు అమలు అయితే రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శించుకోవచ్చని మహిళలు ఆశ పడ్డారన్నారు. అయితే కూటమి ఏడాదిగా నాన్చుతూ వచ్చి ఎన్నో కొర్రీలు పెడుతూ ఆగస్టు 15 నుంచి అంటూ ప్రకటన ఇచ్చిందన్నారు. కొన్ని బస్సు సర్వీసుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించడంతో రాష్ట్రంలోని మహిళలు నిరాశకు గురయ్యారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన మహిళలకు శాపంగా మారిందన్నారు. బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ చివరకు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు.

గోదా గోకులంలో రక్షాబంధన్ వేడుకలు



ప్రత్యేక అలంకారంలో గోదా రంగనాథ స్వామి



మాట్లాడుతున్న మారం నాగరాజు గుప్త

కర్నూలు కల్చరల్: పవిత్ర శ్రావణ మాసం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం నగర శివారులోని గోదా గోకులంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త తుమ్మెపల్లి శ్రీనివాసరావు, గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త మాట్లాడుతూ.. దేశం సురక్షితంగా ఉంటే ధర్మం సురక్షితంగా ఉంటుందని, భక్తి భావన పెరుగుతుందన్నారు. కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు నగర శివారులోని గోదాగోకులం, నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో రక్షా బంధన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు తల్లం నాగ నారాయణరావు, వేముల జనార్ధన్, తల్లం సురేష్, పాలాది సుబ్రహ్మణ్యం, సుదర్శన్, ఇటిక్యాల పుల్లయ్య, ప్రకాష్ చిత్రాల వీరయ్య, మాకం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో గోదా సహిత వెంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని పలు ఆలయాల్లో శనివారం వైభవంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు జరిగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రాఖీలు కట్టుకున్నారు. రాఖీ పౌర్ణమి దృష్ట్యా భక్తులకు రక్షా బంధన్ విశిష్టతను పండితులు వివరించారు. సూర్య నారాయణ స్వామి ఆలయంలో శ్రీ గౌరీ శంకర స్వామికి అభిషేకాలు, రమా సహిత సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి దేవి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో హనుమాన్ చాలీసా పారాయణం, మామిళ్ల పల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీ రాజ శ్యామలా అమ్మవారి హోమం నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. ఆలయాల్లో భక్తులతో సందడిగా మారాయి.

పొంగిపొర్లిన వాగులు, వంకలు



పెద్దపాడు రస్తాలోని వాగుపై రాకపోకలు నిలిచిపోయిన దృశ్యం



గూడూరు–కర్నూలు రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న వక్కెర వాగు

కర్నూలు(రూరల్): కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలన్నీ నీట మునిగాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. గూడూరు మండలంలో 69.8 మిల్లీమీటర్లు, సి.బెళగల్ మండలంలో 57.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కర్నూలు మండల పరిధిలో శనివారం తెల్లవారు జామున 3 నుంచి కురిసిన భారీ వర్షాలకు సుంకేసుల, ఆర్ కొంతలపాడు, తులాశపురం, ఆర్.కె. దుద్యాల, ఎదురూరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పాత జి.సింగవరం నుంచి కొత్త జి. సింగవరానికి రాకపోకలు సాగించే పెద్దపాడు వాగు పొంగిప్రవహించడంతో రాకపోకాలకు తీవ్ర ఇబ్బందలు ఎదురయ్యాయి. పక్కన ఉన్న పొలాలు నీట మునిగాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెద్దపాడు దారిలోని వంతెన ఉదయం 10 గంటల వరకు ఉధృతంగా ప్రవహించింది. పెంచికలపాడు వద్ద ఉన్న వక్కెర వాగు పొంగి ప్రవహించడంతో గూడూరు–కర్నూలు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు కోడుమూరు మీదుగా గూడూరు, కర్నూలుకు వెళ్లారు.

అపూర్వ సమ్మేళనం



నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారులోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీ 2006 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ముందుగా పూర్వ విద్యార్థులు పరిచయం చేసుకోని బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత కాలేజీ ఆవరణలో కలియతిరుగుతూ.. తరగతి గదులను చూసి నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంబరపడ్డారు. అనంతరం నాటి అధ్యాపకులు పత్తి ఓబులయ్య, పి.దస్తగిరి బ్యాంకింగ్, జేఆర్ గిడ్డి మద్దిలేటి రెడ్డి, సుధాకర్, బాలశౌరి, నాగన్న, అప్పటి కరస్పాండెంట్ పీకే జోష్‌ను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానం చేసి వారి ఆశీర్వాదం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రసూల్ బాషా, చాంద్‌బాషా, మారేశ్, చిన్నస్వామి, నాగ శివుడు, లక్ష్మన్న, నాగ శంకర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సహస్ర హాస్పిటల్ ప్రారంభం



జ్యోతి వెలిగించి శ్రీ సహస్ర హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న యాజమాన్యం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక గాయత్రి ఎస్టేట్‌లో శ్రీసహస్ర హాస్పిటల్‌ను మేనేజింగ్ పార్ట్‌నర్లు ఎం.రమేష్, డాక్టర్ సీహెచ్. రాజేష్, ఎం.జయప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో చిన్న భవనంలో సహస్ర హాస్పిటల్‌ను కొనసాగించామని, ఇప్పుడు పూర్వ అశ్విని హాస్పిటల్ ఉన్న భవనంలో అధునాతన సౌకర్యాలు, వసతులతో, నిపుణులైన వైద్యనిపుణులతో ప్రారంభించినట్లు తెలిపారు. నిత్యం ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్ అందుబాటులో ఉంటారని, 24 గంటల పాటు అత్యవసర కేసులు చూస్తామని తెలిపారు.